క్లుప్తంగా

ఉన్నతస్థాయికి చేరుకోవాలి

జస్టిస్ విజయసేన్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థులు అందరికీ మార్గదర్శకంగా నిలిచి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్‌రెడ్డి ఆకాంక్షించారు. మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన 3వ గ్రాడ్యుయేషన్ డేకు మాజీ ఎమ్మెల్యే, కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డితో కలిసి విజయసేన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి తీగల హరినాథ్‌రెడ్డి, ట్రెజరర్ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్, మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల కమిటీ సభ్యుడిగా సుధామ


నియామకపత్రం అందుకుంటున్న సుధామ

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం ఉద్యమకారుల కమిటీలో సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన పోలె సుధామ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా సుధామా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ఏర్పాటు తదనంతరం ఉద్యమకారుల కమిటీ ఏర్పాటు చేసిన మంత్రికి తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సబితారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

సర్వాయి పాపన్న జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

ఆమనగల్లు: మాడ్గుల మండల గౌడసంఘం ఆధ్వర్యంలో విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలకు ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా కొత్త పాండుగౌడ్, కన్వీనర్‌గా కొప్పుల జగన్‌గౌడ్, కో కన్వీనర్‌లుగా దళపతిగౌడ్, నవీన్‌గౌడ్, సత్యంగౌడ్, బిక్కుగౌడ్, శివగౌడ్, రాజుగౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనుగౌడ్, చంద్రయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, గౌనినర్సింహా తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్ అందజేత

తుర్కయంజాల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇంజాపూర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఇదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీరాములు స్పోర్ట్స్ డ్రస్‌ను అందజేశారు. తన తమ్ముడు బట్టు ఆంజనేయులు సైన్యంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు బొడ్డు రవి, విజయమ్మ, శ్రీనివాసులు, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాక విక్రయాలు

కడ్తాల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, కేంద్ర ప్రభుత్వం హర్‌ఘర్ తిరంగా– 2.0 కార్యక్రమంలో భాగంగా, ప్రతి ఇంటిపై జాతీయ పతకాన్ని ఎగురవేసే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని తపాల కార్యాలయం ఆధ్వర్యంలో తపాల సిబ్బంది జాతీయ పతకాలను విక్రయించారు. కడ్తాల్ తపాల కార్యాలయం ఆధ్వర్యంలో 314 జాతీయ పతకాలను విక్రయించినట్లు, ప్రతి పౌరుడు ఉత్సాహంగా జాతీయపతాకాన్ని కొనుగోలు చేశారని పోస్ట్‌మాస్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది రవి తదితరులున్నారు.

మాతాశిశు సంరక్షణే ధ్యేయం

- మాతా శిశు మరణాలు తగ్గించడానికే కేసీఆర్ కిట్లు
- మహేశ్వరం ఆస్పత్రికి 850 మంజూరు
- మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రాజగోపాల్


మహిళకు కేసీఆర్ కిట్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

మహేశ్వరం: మతాశిశు మరణాలను నియంత్రించడంలో కేసీఆర్ కిట్ల పథకం సత్ఫలితాలిస్తోంది. సర్కార్ దవాఖానలో ప్రసవించిన మహిళలకు కిట్‌తో పాటు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ పథకం అమలుతో ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఈ పథకం ద్వారా తల్లీబిడ్డల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మాతాశిశు మరణాల సంఖ్య తగ్గుతోంది. ఈ పథకం ద్వారా గర్భిణీ దశ నుంచి శివువుకు తొమ్మిదో నెలల వయసు వచ్చే వరకు నాలుగు విడుతలుగా ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తోంది. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేల చొప్పున అందిస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన మహిళకే కిట్లు



మహేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవించిన ప్రతి మహిళకు కేసీఆర్ కిట్లు అందజేస్తున్నాం. 2017 జూన్ నుంచి 2023 ఇప్పటి వరకు ఇప్పటి వరకు ఆస్పత్రికి 850 కేసీఆర్ కిట్లు మంజూరయ్యాయి. ఆస్పత్రిలో 815 మంది లబ్ధిదారులకు కిట్లను అందజేశాం. ఇంకా కొన్ని కిట్లు ఆస్పత్రిలో నిల్వ ఉన్నాయి. ఆర్థిక సహాయం వారి అకౌంట్‌లోనే జమ అవుతుంది.

– డా.రాజగోపాల్, సూపరింటెండెంట్, మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రి

గృహలక్ష్మికి 2,027 దరఖాస్తులు


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: గృహలక్ష్మి పథకానికి మండల పరిధిలోని 35 గ్రామాల నుంచి 2027 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కాగా సమయం సరిపోకపోవడంతో గడువు ముగిసిన తర్వాత కూడా సోమవారం లబ్ధిదారులు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి మీ–సేవా కేంద్రాలు, మంజూరు కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకట్రాములు సమక్షంలో సిబ్బంది పరిశీలించారు. అగర్‌మియాగూడ నుంచి 7, ఆకులమైలారం 60, అన్నోజిగూడ 40, బాచుపల్లి 32, బైరాగిగూడ 20, బేగరికంచె 35, బేగంపేట 60, చిప్పలపల్లి 18, దెబ్బడగూడ 104, దాసర్లపల్లి 32, దాసర్లపల్లితండా 9, దావూద్‌గూడ 14, ధన్నారం 25, గూడూరు 78, గుమ్మడవెల్లి 33, జబ్బార్‌గూడ 30, జైత్వారం 41, కందుకూరు 183, కటికపల్లి 40, కొలన్‌గూడ 20, కొత్తగూడ 58, కొత్తూర్ 108, లేమూరు 117, మాదాపూర్ 48, మీర్‌ఖాన్‌పేట 101, ముచ్చర్ల 96, మురళీనగర్ 20, నేదునూరు 236, పెద్దమ్మతండా 14, పులిమామిడి 30, రాచులూరు 77, సాయిరెడ్డిగూడ 27, సరస్వతిగూడ 22, సార్లరావులపల్లి 119, తిమ్మాపూర్ నుంచి 73 దరఖాస్తులు వచ్చాయి. కాగా చాలా మంది లబ్ధిదారులు అర్హత పత్రాలు లేక దరఖాస్తు చేసుకోలేకపోయారు.

పల్లవి స్కూల్‌లో ఎన్నికల సందడి


విద్యార్థులకు బ్యాడ్జీలు పెడుతున్న కల్నల్ రంజిత్ చాకో

బడంగ్‌పేట్: బాచుపల్లిలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థుల మధ్య ఎన్నికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్నల్ రంజిత్ చాకో హాజరయ్యారు. ఎన్నికల్లో స్పోర్ట్స్ కెప్టెన్ (బాయ్), స్పోర్ట్స్ కెప్టెన్ (గర్ల్), హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌గా విద్యార్థులను ఎన్నుకున్నారు. ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జెస్, శాషెస్‌లు ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కల్నల్ రంజిత్ చాకో మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు వివరించారు. నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తులకు సమాజం పట్ల బాధ్యత ఉండాలన్నారు. భవిష్యత్తులో దేశాన్ని ప్రగతిపథంలో నడిపించే బాధ్యత విద్యార్థులపైనే ఉందని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఫౌండేషన్ సేవలు అభినందనీయం


బస్సుతో అమితాబా ఆదరణ విద్యాలయం విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ అమితాబా ఆదరణ విద్యాలయానికి ఎల్ఐసీ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద, అనాధ విద్యార్థుల కోసం 52 సీట్ల బస్సును అందజేశారు. సోమవారం బస్సును ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ మేనేజర్ శ్యాంసుందర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఆదరణ ఆశ్రమంలో నివసించే 150 మంది విద్యార్థులకు ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆదరణ ఫౌండేషన్ చైర్మన్ జాడి మాధవరావు మాట్లాడుతూ మా ఆశ్రమంలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థుల కోసం బస్సు అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల నిర్వహణ భేష్

మహేశ్వరం: మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ విధానం, మండల సమఖ్యా పనితీరు చాలా బాగుందని హిమాచల్‌ప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ప్రియత్ మండల్ కొనియాడారు. సోమవారం మండలంలోని తుమ్మలూరు, మహేశ్వరం గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల విధానం, పల్లె ప్రగతి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవడం బాగుందన్నారు. ఆర్థికంగా ఎదగడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పల్లె ప్రకృతి వనం, నర్సరీల ఏర్పాటు, ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, చెత్త డంపింగ్ యార్డుతో పాటు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని ప్రశంసించారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను హిమాచల్ రాష్ట్రంలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్, అడిషనల్ పీడీ డీఆర్‌డీఓ జంగారెడ్డి, ఎంపీడీఓ నర్సింహ, ఏపీఎం సత్యనారాయణ, తుమ్మలూరు గ్రామ సర్పంచ్ సురేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సరీని సందర్శించిన ప్రియత్ మండల్

కాంగ్రెస్ పవర్ చూపిస్తాం

- పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి
- హస్తం గూటికి చేరిన గులాబీ శ్రేణులు


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణా నాయక్, అనుచరులు

మహేశ్వరం: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పవర్ ఏంటో చూపిస్తామని.. మహేశ్వరం గడ్డపై పార్టీ జెండాను ఎగురవేస్తామని పీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని రామచంద్రగూడ, పోరండ్ల, గాంధీనగర్ తండా, కల్వకోల్, పడమటి తండా, గంగారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంగోత్ కృష్ణానాయక్‌తో పాటు 200మంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి రేవంత్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును సోనియమ్మకు కానుక ఇస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ నియంతపాలన కొనసాగిస్తున్నాయన్నారు. నాయకులంతా సమన్వయంతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే నియోజకవర్గం నుంచి బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంప్రదింపులు జరుగుతున్నారని చెప్పారు. రాష్ట్రంలోనూ కర్ణాటక ఫలితాలే పునరావృతమవుతాయన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పించి గౌరవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి, బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, పార్టీ మహేశ్వరం, కందుకూరు మండలాల అధ్యక్షులు ఈశ్వర్ ముదిరాజ్, కృష్ణా నాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు శశికాంత్, కుమార్, నారాయణ, గాన్సీరామ్, శివ, పాండు, సుధాకర్, సేవ్యా నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

'ఏనుగు' దిగిన నియోజకవర్గ ఇన్‌చార్జి

కందుకూరు: మండల పరిధిలో బీఎస్పీ, బీజేపీ, టీడీపీలకు చెందిన పలువురు నాయకులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, మల్లేశ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో బీఎస్పీ నియోజకవర్గం ఇన్‌చార్జి అందుగుల సత్యనారాయణ, బీజేపీ, టీడీపీలకు చెందిన ఎగ్గిడి కృష్ణ, సల్వేటి పరమేశ్‌తో పాటు పలువురు నాయకులు ఆదివారం సాయంత్రం రేవంత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.పాండు, యూత్ అధ్యక్షుడు నరసింహాచారి, జగన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి టి.వినోద్‌చారి, నాయకులు సురేందర్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

మహేశ్వరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి జిల్లాలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి సబితారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పెండ్యాల, కల్వకోల్, అమీర్‌పేట్ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. పెండ్యాల–అమీర్‌పేట్ వయా కల్వకోల్ బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి ప్రత్యేక చొరవతో రూ.8 కోట్ల నిధులు మంజూరు చేయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో 30 పడకల ఆస్పతి నూతన భవన నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ భవనం, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్ అదనపు భవనాల నిర్మాణాలతో పాటు డైట్ కాలేజ్ నిర్మాణం, ఎస్టీ గురుకుల హస్టల్ భవనం, జూనియర్ కాలేజ్ అదనపు భవనాలు, మహేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనాలతో పాటు మరిన్ని నూతన భవనాలను నిర్మిస్తామన్నారు. అలాగే శ్రీశైలం జాతీయ రహదారి తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం వరకు రూ. 14 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణం, గిరిజన తండాల నుంచి గ్రామాలకు అనుసంధానంగా బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 9.41 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు థామస్‌రెడ్డి, కల్వకోల్ ఎంపీటీసీ స్వప్న పలువురు పాల్గొన్నారు.


సబితారెడ్డిని కలిసిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్


ఆర్డీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న ఏఎన్ఎంలు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండో ఏఎన్ఎంలు.. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్, ఎంపీడీఓ వెంకట్రాములు, పీహెచ్‌సీల్లోని వైద్యాధికారులకు సమ్మె నోటీసులు అందించారు. ఈనెల 16నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ... 20 ఏళ్లుగా రెండోవ ఏఎన్ఎంలుగా సేవలందిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల బాగోగులు చూశారన్నారు. అర్హత పరీక్ష పేరుతో వారిని ప్రభుత్వం తొలగించాలని చూస్తోందని ఆరోపించారు. ఎలాంటి పరీక్షలు లేకుండా వారిని క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగుల లాగానే అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పార్వతమ్మ, మునెమ్మ, మంజుల, అలివేలు, సునీత, సుజాత, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రాధాన్యం

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఉద్యమకారుల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. మహేశ్వరం నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్‌గా నాల్యకొండ శ్రీనివాస్‌రెడ్డి, కో కన్వీనర్‌గా కె. నర్సింహ ముదిరాజు, కార్యవర్గ సభ్యులుగా మారోజు రామచారి, కొండ్ర శ్రీనివాస్, పుట్టం విజేందర్, పోతే సుధామ, దయానంద్ ముదిరాజ్, వెంకటచారి, హనుమంతరావు, ఈశ్వర్‌గౌడ్, యాదగిరి ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, శివశంకర్, యాదయ్య, ఇలియాజ్, సయ్యద్ ఫైరోజ్ అహ్మెత్, లావణ్య, రాజ్‌కుమార్లను ఎన్నకున్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్

కడ్తాల్: 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రతిభావంతులైన మహిళలను ప్రోత్సహించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి, ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శక్తి సూపర్ షీ' కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన మహిళల ఆధ్వర్యంలో, అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో జాతీయ జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టాలని కోరారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, కడ్తాల్, ఆమనగల్లు మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు ఇమ్రాన్‌బాబా, శివ, బాలకృష్ణ ఉన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

ఆమనగల్లు: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశంపై ఉన్న ప్రేమాభిమానాలు చాటుకోవాలని జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు కండెసాయి కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని నిర్వహించారు. స్థానిక అయ్యప్ప కొండ వద్ద బైక్ ర్యాలీని కండెసాయి ప్రారంభించారు. అనంతరం స్థానిక పట్టణంలోని అన్ని వీధుల్లో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భగీరథ్, జిల్లా అధికార ప్రతినిధి ప్రభాకర్, మండల బీజేవైఎం అధ్యక్షుడు శ్రీను, కల్వకుర్తి బీజేపీ మీడియా కన్వీనర్ రవిరాథోడ్ పాల్గొన్నారు.

ఘనంగా శివ సహస్రనామ యజ్ఞం

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీ శివ సహస్రనామయజ్ఞం ఘనంగా నిర్వహించారు. శివ సహస్రనామ యజ్ఞం సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివానందస్వామి ఆధ్వర్యంలో శివసహస్రనామయజ్ఞం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ సభ్యులు కిషన్‌రెడ్డి, కార్యనిర్వాహకులు విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి: బీజేవైఎం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం బీజేవైఎం ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నాలో బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం సాంకేతిక సమస్యలతో మూసివేశారని, అప్పటి నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆమనగల్లులో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తే ఆమనగల్లు మండలంతో పాటు కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలకు ఇబ్బందులు తీరుతాయన్నారు. అనంతరం తహసీల్దార్ లలితకు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిది ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కండెసాయి, మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజశేఖర్, రాఘవ, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ టెండర్లలో రిజర్వేషన్లకు డిమాండ్

ఆమనగల్లు: వైన్‌షాపు టెండర్లలో పాల్గొనే రిజర్వేషన్‌దారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పీసీసీ సభ్యులు, కల్వకుర్తి గౌడసంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఖజానా నింపుకోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం వైన్‌షాపులకు 3 నెలల ముందే టెండర్లు నిర్వహించిందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం వైన్‌షాపు కేటాయింపులో గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించిన ప్రభుత్వం దరఖాస్తు రుసుములో ఎందుకు రాయితీ కల్పించడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షలు కట్టి వైన్‌షాపు టెండర్లలో పాల్గొనే రిజర్వేషన్ దారులకు షాపు దక్కకపోతే దరఖాస్తు రుసుము 2 లక్షలు తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.